క్లుప్తంగా

దేవాదాయ శాఖ పరిధిలోకి తాడువాయి శివాలయం

మునగాల : మండలంలోని తాడువాయిలో గల పురాతన శ్రీభ్రమరాంభిక మల్లికార్జునస్వామి (శివాలయం) ఆలయం రాష్ట్రంలో ఎంతో ప్రాచుర్యం కలిగి ఉన్నది. కానీ ఆలనపాలన కరువై, నిరాదరణకు గురైంది. దీంతో స్థానిక నాయకులు ఆలయ దుస్థితిని స్థానిక ఎమ్మెల్యే పద్మావతి దృష్టికి తీసుకువెళ్లగా ఆమె.. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో దేవాదాయ శాఖకు రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేయించారు. దీంతో దేవాదాయ శాఖ అధికారులు ఆలయ పూర్తిచరిత్రను పరిశీలించి దేవాదాయ శాఖ పరిధిలోకి చేర్చుతూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్ఈడీ లైట్లు అందజేత



ఎల్ఈడీ లైట్లు అందజేస్తున్న కుసుమ వెంకటమ్మశ్రీనివాస్‌రెడ్డి

గరిడేపల్లి : మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామ పంచాయతీకి అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కుసుమ వెంకటమ్మశ్రీనివాస్‌రెడ్డి 50 ఎల్ఈడీ లైట్లను అందజేశారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి బాలాజీకి లైట్లను అందజేశారు. కార్యక్రమంలో అచ్చయ్య, జానకిరాములు, భిక్షం, సైదులు, గోపిరెడ్డి, పిచ్చిరెడ్డి, వెంకట్‌రెడ్డి, సందీప్, సుధాకర్, శ్రీకాంత్, ప్రభాకర్‌రెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామలక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అనురాగ్ కళాశాలలో కంటి వైద్యశిబిరం

అనంతగిరి : మండల పరిధిలోని అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ టి.సురేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్యసిబ్బంది కంటివైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ దేవేందర్, శ్రీవిక్రమ్, వెన్నెల, ప్రశాంత్, పాషా, కె.జెపాల్‌రెడ్డి, కె.పాండురంగప్రసాద్, ఎం.భూపతిరావు, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ బండి మోహన్‌బాబు

హుజూర్‌నగర్ : ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఎస్ఐ బండి మోహన్ బాబు అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో లోకల్ ఆటో యూనియన్ (ఐఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటో డ్రైవర్ల సమావేశంలో ఎస్ఐ పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్క ఆటో డ్రైవర్ ఖాకీ చొక్కా ధరించాలన్నారు. ఆటో ఫిట్నెస్, ఇన్సూరెన్స్ ధృవపత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. డ్రగ్స్, గంజాయిని అరికట్టడంలో తమ వంతు సహకరించాలన్నారు. అనంతరం ఎస్ఐని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు బెల్లకొండ గురవయ్య, అమర్‌నాథ్‌రెడ్డి, ముక్కంటి, రఫీ, లింగరాజు, రాంబాబు, రాము, బల్వత్ సింగ్, గోపి, కృష్ణ, లతీఫ్, సాయి, సతీష్, శివ, తారక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

గరిడేపల్లి : విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎంఈఓ చత్రునాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని గానుగబండ గ్రామంలో గల జెడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో టాయిలెట్స్, ఎలక్ట్రికల్, వాటర్ వసతులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదవడం, రాయడం, గణితంలో చతుర్విద ప్రక్రియలు వచ్చేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పిచ్చయ్య, కె.బాలసైదిరెడ్డి, మధుసూదన్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా సక్రమంగా అందించాలి

మఠంపల్లి : మండలంలోని రైతులకు యూరియాను సక్రమంగా అందజేసేందుకు ఎరువుల డీలర్లు సహకరించాలని వ్యవసాయ సహాయ సంచాలకుడు రవినాయక్ కోరారు. మంగళవారం మఠంపల్లిలోని ఏఓ కార్యాలయంలో నిర్వహించిన మండల ఎరువుల డీలర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలానికి సరిపడా ఎరువులు దిగుమతి అవుతున్నా రైతులకు అందని పరిస్థితి దాపురించిందని, డీలర్లు రైతులకు సక్రమంగా యూరియా అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎరువులను అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఏఓ శ్రీనివాస్, ఏఈఓలు, ఎరువుల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా అప్రోచ్ రోడ్డు పనులు

- జాతీయ రహదారి నుంచి ఇంటిగ్రేటెడ్ స్కూల్ వరకు డబుల్‌రోడ్డు నిర్మాణం
- మూడు నెలల్లో పూర్తిచేసేలా ప్రణాళిక
- రూ.10 కోట్ల నిధులు మంజూరు

చిలుకూరు : మండలంలోని సీతారాంపురం గుట్టల్లో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నుంచి జాతీయ రహదారి వరకు చేపడుతున్న అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మట్టి పోసి చదును చేశారు. వరద నీరు వెళ్లేందుకు గూనలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ. 10 కోట్ల నిధులు మంజూరు చేసింది. అయితే కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నియోజవర్గానికి ఒక ఇంటిగ్రేటెట్ పాఠశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రెండో విడతలో కోదాడ నియోజకవర్గానిక స్కూల్ మంజూరైంది. దీనిని చిలుకూరు మండలం సీతారాంపురం గుట్టల్లో నిర్మించనున్నారు. స్కూల్ నిర్మాణంలో భాగంగా అప్రోచ్ రోడ్డుకు వారం రోజుల క్రితం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. స్థానిక ఎమ్మెల్యే పద్మావతితో కలిసి శంకుస్థాపన



మట్టి పోసి చదును చేసిన దృశ్యం

చేశారు. మూడు నెలల్లో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించారు.

2.5 కిలోమీటర్లు..

సీతారాంపురం గుట్టలో 1151 సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూమిలో 22 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనాలు నిర్మించనున్నారు. ఈ భూమి సీతారాంపురం స్టేజీ నుంచి హుజూర్‌నగర్ వైపు అర కిలోమీటర్ దూరంలో కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారి నుంచి 2.5 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అయితే జాతీయ రహదారి నుంచి పాఠశాల వరకు డొంక దారి ఉంది. ఈ దారిని డబుల్ లైన్ బీటీ రోడ్డుగా మార్చేందుకు ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పద్మావతి రూ. 10 కోట్లు మంజూరు చేయించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెట్ స్కూల్‌కు ఇప్పటికే రూ. 250 కోట్లు మంజూరు చేయించారు. అయితే చిలుకూరు మండలంలో నేటి వరకు ఒక గురుకుల పాఠశాల, కస్తూరిబా పాఠశాల, మోడల్ స్కూల్ లేదు. ఇప్పుడు ప్రభుత్వం మండలంలో ఇంటిగ్రేటేట్ స్కూల్ నిర్మిస్తుండడంతో మండల ప్రజలు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పనులు త్వరితగతిన పూర్తిచేయిస్తా



చిలుకూరు మండలంలోని సీతారాంపురం గుట్టల్లో నిర్మించే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెట్ స్కూల్‌కు జాతీయ రహదారి నుంచి అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి రూ. 10 కోట్లు మంజూరయ్యాయి. రోడ్డు పనులు త్వరితగతిన పూర్తిచేసేందేకు కృషి చేస్తా. మరో మూడు నెలల్లో రోడ్డు పనులు పూర్తి చేసి, వెంటనే ఇంటిగ్రేటెట్ స్కూల్ నిర్మాణ పనులు చేపడుతాం.

– ఎన్. పద్మావతిరెడ్డి, ఎమ్మెల్యే, కోదాడ

మహిళల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



మండల స్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

మునగాల : మహిళల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎంపీడీఓ కె.రమష్‌దీనదయాళ్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి వైద్యాధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబర్ 2 వరకు ఆరోగ్యమైన మహిళ – శక్తివంతమైన కుటుంబం అనే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మహిళలకు ఈఎన్‌టీ, దంత, నోటి, రొమ్ము, గర్భాశయ, ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు, గర్భిణులకు పరీక్షలు, రక్తహీనత పరీక్షలు నిర్వహించి నిపుణులైన వైద్యుల సాయంతో చికిత్స అందించేందుకు ప్రణాళిక రూపొందించాలని అధికారులను కోరారు. సేవలను ప్రతి మహిళ వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వి.సరిత, రేపాల, మునగాల పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ వినయ్‌కుమార్, రవీందర్, హెచ్‌ఈఓ బి.భాస్కర్‌రాజు అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సరిత, శ్రీలత, హెల్త్ అసిస్టెంట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నడిగూడెం : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్.లక్ష్మీప్రసన్న కోరారు. మంగళవారం నడిగూడెం మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. ప్రస్తుత సీజన్‌లో వచ్చే వ్యాధుల గురించి విద్యార్థులకు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శారద, నడిగూడెం పల్లె దవాఖానా వైద్యాధికారి డాక్టర్.హరినాథ్, పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి, హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, వార్డెన్ లతీమూన్, ఏఎన్‌ఎంలు సుజాత, రాధ, ఆశా కార్యకర్తలు లక్ష్మి, సైదమ్మ, సునీత, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



హుజూర్‌నగర్ : హిందీ టీచర్ వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



నేరేడుచర్ల : హర్యానా సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థుల ప్రదర్శన

హుజూర్‌నగర్ : మండలంలోని కరక్కాయలగూడెంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. అనంతరం హిందీ టీచర్ బొల్లం వెంకటేశ్వర్లును సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

హర్యానా సంప్రదాయ దుస్తుల్లో ప్రదర్శన

నేరేడుచర్ల : పట్టణంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం హిందీ దివస్ నిర్వహించారు. ఇందులో భాగంగా హర్యానా సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, హిందీ ఉపాధ్యాయురాలు నాగమణి మాట్లాడుతూ భారతావనిలో అత్యధికులు మాట్లాడే భాష హిందీ అని, స్వాతంత్రోద్యమ సమయం నుంచి భారత సమాజాన్ని ఏకం చేయడానికి హిందీ ఎలా దోహదపడుతోందనే విషయాన్ని వివరించారు. అదేవిధంగా ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



మఠంపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్టీయూ నాయకులు

మఠంపల్లి : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ కృషి చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బందం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మఠంపల్లి మండల కేంద్రంలో ఎస్టీయూ సభ్యత్వ నమోదును ప్రారంభించి మాట్లాడారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా మండలం లోని పలు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులకు సభ్యత్వాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు నేలపట్ల సత్యనారాయణగౌడ్, కందుల కిరీటం, రాములు, రాంరెడ్డి, సైదులు, లోకేష్, మంజునాథ్, గోపి, ఎర్రయ్య, హరిప్రసాద్, పవన్‌కుమార్, వీరబాబు, రాజేష్, వెంకటేవ్వర్లు, నరసింహారావు, శ్రీనివాస్, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు



కేజీబీవీలో సభ్యత్వాలు అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

మునగాల : మండల కేంద్రంలోని కేజీబీవీతో పాటు మోడల్ స్కూల్, మండలంలోని ముకుందాపురం, నారాయణగూడెం, ఆకుపాముల, బరాఖత్‌గూడెంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో , కొక్కిరేణి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్, పాండురంగాచారి, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు విక్రమ్‌రెడ్డి, హుస్సేన్, సభ్యులు తొగరు ప్రవీణ్, లక్ష్మణాచారి, రామకృష్ణనాయక్, సాంబశివరావు పాల్గొన్నారు.

పల్లెవెలుగు బస్సు పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్

పాలకవీడు : మిర్యాలగూడ ఆర్టీసీ డిపో నుంచి పాలకవీడు మండలానికి పల్లె వెలుగు బస్సు సేవలను అధికారులు పునరుద్ధరించారు. గత నెల రోజులుగా బస్సు సేవలను నిలిపివేయడంతో పాలకవీడు మండల ప్రజలు ప్రయాణానికి ఎదుర్కొన్న ఇబ్బందులపై ఈనెల 12వ తేదీన సాక్షి దినపత్రికలో 'బస్సు సేవలు కరువు'అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి బస్సు సేవలను పునరుద్ధరించారు. తమ సమస్యను వెలుగులోకి తెచ్చిన సాక్షి యాజమాన్యానికి ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిలుకూరు : మండలంలోని బేతవోలు సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ రామిశెట్టి శ్రీనివాస్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

నడిగూడెం : ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ మల్సూర్‌నాయక్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి, వార్డెన్ లతీమూన్ ఉన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

పాలకవీడు : రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ కమలాకర్ హెచ్చరించారు. మంగళవారం పాలకవీడులో తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బియ్యం పంపిణీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని డీలర్లకు సూచించారు. సరైన సమయంలో, పారదర్శకంగా బియ్యం పంపిణీ జరగాలని అన్నారు. ప్రజల నుంచి ఏమైన ఫిర్యాదులు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో రెవెన్యూ అధికారులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

నడిగూడెం : నడిగూడెం మండల అభివృద్ధికి సహకరించాలని కోరుతూ నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డిని కోరినట్లు మంగళవారం కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ స్థానిక విలేకరులకు తెలిపారు. ఎంపీ కోదాడకు వచ్చిన సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వేపూరి సుధీర్ ఉన్నారు.

నేడు విశ్వకర్మ జయంతి

చిలుకూరు : మండల కేంద్రం పరిధిలోని కవితా జూనియర్ కళాశాల వద్ద గల వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రాంగణంలో బుధవారం విశ్వకర్మ జయంతి నిర్వహించనున్నట్లు ఆలయ మఠాధిపతులు తమ్మి బ్రహ్మచారి మంగళవారం తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం



పూజలో పాల్గొన్న ధర్మకర్తలు, అధికారులు

హుజూర్‌నగర్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ లక్ష్మీనరసింహవేణుగోపాల స్వామి దివ్యక్షేత్రంలో మంగళవారం క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా 108 నాగవల్లి దళాలతో ఆకుపూజ, గంధ సింధూరంతో ప్రత్యేక పూజలు చేశారు. పానకం, వడపప్పు, పండ్లు, నారికేళం, పులిహోర, వడమాల, ప్రసాద నివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, ధర్మకర్తల మండలి, అధికారులు సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే సమాజంలో గుర్తింపు

- డీఐఈఓ భానునాయక్



అనంతగిరి : అవార్డు గ్రహీతలతో ఉపాధ్యాయులు

నేరేడుచర్ల : ప్రతిఒక్కరూ విధుల్లో అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపు లభిస్తుందని డీఐఈఓ భానునాయక్ అన్నారు. రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్న నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు వెంకటరమణను మంగళవారం అధ్యాపకులు సిబ్బంది, విద్యార్థులతో కలిసి ఘనంగా సత్కరించారు. అదేవిధంగా మూడేళ్ల పాటు కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసి రెవెన్యూ డిపార్ట్‌మెంటులోకి వెళ్లిన వెంకన్నను సత్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ మద్దిమడుగు సైదులు, ప్రణతి, కేఎల్ఎన్ రావు, శ్రీనివాసులు, వెంకన్న, నరేందర్, సునిత, అంజయ్య, గణేష్, ప్రసాద్, అపర్ణ, వీరేష్, జానకిరామ్‌రెడ్డి, దుర్గయ్య, అన్వేష్, వెన్నెల, సుశాంత్, దుర్గయ్య, ఖాన్, మెహబూబాబేగం, శ్రీను తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

హుజూర్‌నగర్ : ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని ఎంఈఓ సైదానాయక్, ఎంపీడీఓ లావణ్య అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ డిజిటలైజేషన్ యుగంలో విద్యార్థులను గొప్పగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో మఠంపల్లి ఎంఈఓ వెంకటాచారి, సీహెచ్‌ఎంలు బీరెల్లి శ్రీనివాసరెడ్డి, పెనుగొండ శ్రీనివాస్, జీహెచ్‌ఎంలు నలబోలు శ్రీనివాసరెడ్డి, దాడి నర్సిరెడ్డి, జహూరే ఆలం, రిటైర్డ్ హెచ్‌ఎం అంకతి అప్పయ్య, వేముల శ్రీనివాస్, రాజశేఖర్ రెడ్డి, అత్తి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం

అనంతగిరి : మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో ఎంఈఓ తల్లాడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 13 మందికి అవార్డుల అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులకు బాధ్యత మరింత పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన బీవీఆర్ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరిసింగ్, బీవీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బుర్ర పుల్లారెడ్డి, బుర్ర నర్సింహారెడ్డి, వివిధ ఉపాధ్యాయ సంఘం నాయకులు జహీర్‌ఖాన్, ఉపేందర్, ఖాసిం, కాంపాటి ఉపేందర్, పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామినేని సతీష్, పాయిలి గురుస్వామి, షేక్ మస్తాన్, బొంకూరి చంద్రశేఖర్, గోపతి ఉపేందర్, గోపతి కనకారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

నడిగూడెం : మండలంలోని రత్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న కృష్ణవేణి ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందారు. మంగళవారం ఆ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణవేణిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జి.శారద, ఉపాధ్యాయులు వెంకటాచారి, రజిని, నారాయణరావు, నరేందర్, కర్నాకర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుల్లయ్య, ఉపాధ్యాయురాలు కరుణ, సీఆర్‌పీ నందిగామ రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.



నేరేడుచర్ల : ఉత్తమ అధ్యాపకుడు వెంకటరమణను సన్మానిస్తున్న, డీఐఈఓ, అధ్యాపకులు

ఉత్తమ ఉపాధ్యాయులకు..

చిలుకూరు : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఎంపికైన మండల ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయులు జనార్ధన్‌రావు, టీఎల్ఎన్ స్వామి, ఎస్.శ్యామ్‌సన్, సజ్జనకుమారి, భవని, రామనర్సయ్య, రామాంజనేయులు, పుల్లారావు, శైలజ, శ్యామ్‌సందర్‌ను మండల విద్యా శాఖ, ఉపాధ్యాయ సంఘల ఆధ్వర్యంలో సత్కరించారు. ఎంపీడీఓ గిరిబాబు, తహసీల్దార్ ధృవకుమార్, ఎంఈఓ గురవయ్య, జీహెచ్‌ఎంలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



చిలుకూరు : ఉత్తమ ఉపాధ్యాయిలను సన్మానిస్తున్న అధికారులు



హుజూర్‌నగర్‌లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో..

తెలంగాణ స్వాతంత్ర్య పోరాటంగా ప్రకటించాలి



మేళ్లచెరువు : అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

మేళ్లచెరువు : రైతాంగ సాయుధ పోరాటాన్ని తెలంగాణ స్వాతంత్ర్య పోరాటంగా ప్రకటించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం చింతలపాలెం మండల కేంద్రంలో ఆనాడు రజాకారులకు వ్యతిరేకంగా పోరాడి అమరులైన వారికి నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహించిన ఉస్తేల వీరారెడ్డి సతీమణి రాములమ్మ ఐదవ వర్ధంతిలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నారాయణరెడ్డి, చింతిరాల రవి, కోటమ్మ, మంగయ్య, జియాలుద్దీన్, సత్యం, భాషా, పాపిరెడ్డి, రామారావు, అంకరాజు, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల త్యాగాలతోనే విమోచనం

అనంతగిరి : కమ్యూనిస్టుల ప్రాణత్యాగాలతోనే తెలంగాణకు విమోచనం లభించిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బద్దం కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు శాంతినగర్, మొగలాయికోట, బొజ్జగూడెంతండా గ్రామాల్లో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జెండాలు ఎగురవేశారు. అనంతరం కోదాడలో నిర్వహించిన సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి యరసాని రవి, శాంతినగర్ గ్రామ కార్యదర్శి బత్తిని వీరబాబు, బాణోతు కోటేశ్వరరావు, నూకల శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు నాగేశ్వరరావు, నాగభద్రం, మండల కౌన్సిల్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుల స్మారక స్థూపాల వద్ద మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్ మాట్లాడుతూ.. సాయుధ పోరాట యోధుల ఆశయాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నగేష్, యాకూబ్, భిక్షం, సోమయ్య, శ్రీనివాస్, శ్రీను, మట్టయ్య, సైదులు, లక్ష్మయ్య, వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరులో..

చిలుకూరు : చిలుకూరులోని సీపీఐ భవనం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయుధ పోరాట యోధుడు దొడ్డా నర్సయ్య విగ్రహానికి, దొడ్డా నారాయణరావు ప్రతిమకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, మండల కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి సాహెబ్ అలీ, నాయకులు చేపూరి కొండలు, చిలువేరు ఆంజనేయులు, పిల్లుట్ల కనకయ్య, రెమిడాల రాజ, కాంపాటి వెంకటయ్య, అనంతుల రాము, నాగేశ్వరరావు, శ్రీను, రాంబాబు, ముక్క లక్ష్మీనారాయణ, కోటేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



చిలుకూరు : దొడ్డా నర్సయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గన్నా చంద్రశేఖర్, నాయకులు



అనంతగిరి : శాంతినగర్‌లో అమరవీరుల స్మారక స్థూపం వద్ద మాట్లాడుతున్న బద్దం కృష్ణారెడ్డి

మునగాలలో కుక్కల బెడద



మునగాలలో సంచరిస్తున్న శునకాలు

మునగాల : మండల కేంద్రంలో వీధికుక్కలు స్వైర విహారం చేస్తోన్నాయి. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వీధికో పదిచొప్పున వందల సంఖ్యలో శునకాలు గ్రామంలో తిరుగుతూ బాటసారుల వెంటబడి కరుస్తున్నాయి. దీంతో గ్రామస్తులు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. చేతిలో కర్రపట్టుకొని తిరగాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇటీవల రెండు కుక్కలకు పిచ్చి లేవడంతో పలువురిని గాయపర్చడమే కాక పది పశువులపై దాడి చేశాయి. ముఖ్యంగా వేకువజామున వాకింగ్‌కు వెళ్లే వారిని ఈ శునకాలు వెంబడించి కరుస్తున్నాయి. పలు కూడళ్లలో శునకాల బెడదతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు, మహిళలు జంకుతున్నారు. గ్రామపంచాయతీ స్పందించి శునకాల నివారణ చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టి స్వామి వారి కల్యాణం జరిపారు. శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం నీరాజనమంత్రపుష్పాలతో మహానివేదన గావించారు. శ్రీవీరాంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.